# వివాహం

"ఉత్తరం ఎక్కణ్ణుంచి సరళా ?" వైట్‌కోటు స్టాండ్ మీద వేస్తూ అడిగాడు డాక్టర్ మనోహర్.

కళ్లుమూసుకుని, సోఫాలో వెనక్కు వాలి, ఉత్తరాన్ని చేత్తో నలుపుతూన్న సరళ కళ్ళెత్తి చూచింది. "ఊఁ! వైజాగ్‌నుంచి డాక్టర్ కమల వ్రాసింది." నిర్లిప్తంగా వుందా సమాధానం.

ఎదురుగా సోఫాలో కూర్చుని మేజోళ్ళు విప్పుకుంటూ, మనోహర్ ఆశ్చర్యంగా భార్యవేపు చూచాడు. తమ వివాహమైన తర్వాత యీ రెండేళ్ళలోనూ, ఏ సందర్భములోనూ, సరళ తన ప్రాణస్నేహితురాలయిన డాక్టర్ కమలను డిగ్రీతో సహా చెప్పడం వినలేదు.

"కులాసాయేనా మీ డియరెస్టు ఫ్రెండ్ ?"

"ఆ! ఆవిడగారు పెళ్ళిచేసుకున్నారు!" సరళ కోపంగా ఉత్తరాన్ని టేబిల్‌మీద పడేసింది.

"ఓహ్ ! శుభవార్త ! హార్టలీ విషింగ్స్ వ్రాయి ఇద్దరి తరఫునా ! ఇంతకూ వరు డెవరన్నావ్ ?" కుతూహలంగా అడిగాడు మనోహర్.

"ఏమో ! ఎవరికి తెలుసు ? ఆ జాబు చదువుకోండి." మనోహర్ ముందుకు కవరు నెట్టి, పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

డాక్టర్ సరళ.

మనోహర్ చిన్నగా నవ్వుకున్నాడు. ఈ ఆడవాళ్ళెప్పుడూ యింతే! ఒకరిమీద కోపం మరొకరిమీద ప్రదర్శిస్తారు.

"డియర్ సరూ, ఆగస్టు పదిహేనవ తేదీ ఉదయం పది గంటల సుముహూర్తంలో నేను రిజిష్టర్ మేరేజి చేసుకున్నాను. ముందుగా వివరాలు నీకు తెలిస్తే, నువ్వసలు మా వివాహానికి అంగీకరించవనే భయంతో తెలియబరచలేదు. డాక్టర్ మనోహర్, నువ్వూ సాధ్యమయినంత త్వరగా వచ్చి, మా దంపతులను దీవించి వెళ్ళవలసిందిగా మరీమరీ కోరుతున్నాను. మనం కలుసుకున్నప్పుడు అన్ని సంగతులూ వివరంగా మాట్లాడుకుందాం.

నీ కమల"

కవర్ పిన్ చేసి ఆశ్చర్యంలో మునిగిపోయాడు మనోహర్. సరళా, కమలా డియరెస్ట్ ఫ్రెండ్స్. అందులోనూ తనవూ, మనసూలా ఎం. బి. బి. ఎస్., పూర్తిచేశారు. ఎప్పుడూ సరళ మా కమల అంటూ కబుర్లు చెబుతూనే వుంటుంది. కమలకు వరుణ్ణి సెలెక్టు చెయ్యాల్సిన బాధ్యత తనమీదే వుందంటూ కలలు కంటూండేది. అలాంటిది హఠాత్తుగా ఇలాచేసిందేమిటి కమల? మరి సరళకు కోపం వచ్చిందంటే రాదూ?

"డాక్టర్‌గారూ!" సిస్టర్ మేరీ బయటనుంచి వేసిన సన్నని కేకతో ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టాడు మనోహర్.

"కమిన్ సిస్టర్! ఏంకావాలి?"

"ఇదో, ఇక్కడ లేడీ డాక్టర్‌గారి సైన్ కావాలి!"

"కూర్చో! ఇప్పుడే వస్తారుండు!" మనోహర్ పక్క గదిలోకి వచ్చాడు. అత నూహించుకున్నట్లుగానే ఏదో ఆలోచిస్తూ పడుకునివుంది సరళ.

"సరళా!" మెల్లిగా పిలిచా డతను.

"వస్తున్నా" సరళ బయటికి వచ్చింది.

"నమస్తే డాక్టర్!" మేరీ కాగితాలు టేబిలుమీద పెట్టింది.

"ఇదుగో సిస్టర్, ఈ లెటర్ కూడా కాస్త డి. ఎం. ఓ. గారికి ఇవ్వగలవా?" సరళ లెటర్ పేడ్ తీసుకుని వ్రాయటం మొదలెట్టింది.

"ఏం డాక్టర్?" సిస్టర్ ఆదుర్దాగా అడిగింది.

"ఒంట్లో ఏమీ బాగాలేదు. ఓ వారంరోజులు శలవు పెడ్తున్నాను!' కవరు అంటించి ఇచ్చేసింది.

సిస్టర్ అయోమయంగా ఒకసారి ఆమె వేపుచూచి తెల్లటి బూట్లు చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయింది.

"వారంరోజులు శలవు పెట్టావా?" స్నానం ముగించుక వస్తున్న మనోహర్ మృదువుగా అడిగాడు.

"ఊ! నా మనస్సేం బాగాలేదు. ముందు వైజాగ్ వెళ్లిరావాలి...!" బొంగురుబోయిన కంఠస్వరాన్ని అణుచుకుంటూ భర్తవేపుచూచి ముగ్ధురాలయిపోయింది సరళ.

తెల్లగా, బలిష్ఠమైన శరీరంతో అందంగావున్న మనోహర్, ఏదో లోకంనుంచి దిగివచ్చినట్లున్నాడు !

* * * *

ట్రెయిన్ వూపుకు, హాయిగా అందరూ నిద్రపోతు న్నారు. ఆలోచనలు తలలో సుడులు తిరుగుతుండటంవల్ల సరళకళ్ళు మూతలు పడటంలేదు. ఎవరి ఆలోచనలతోనూ, ఆవేదనలతోనూ ప్రమేయం లేకుండా పరుగెత్తుతోంది ట్రెయిన్. ఆ రోజుల్లో...కమల, తను ఎం. బి. బి. ఎస్., చదివే రోజులవి. వనజా, విమలా వాళ్ళంతా ఈ స్నేహాన్ని చూచి ఎంతో అసూయపడ్తూ వుండేవాళ్లు. ఒకటే రూంలో వుండేవాళ్ళు. ఒకటే అభిరుచులు, ఒకేరకమయిన భావా లూను! ఒక్క తల్లిపిల్లలుకూడా అంత కలిసిమెలసి ఉండ రేమో ! ఫైనలియర్ లాస్ట్ టరమ్‌లో ఓరోజు బీచ్‌లో కూర్చుని వుండగా పెళ్ళిళ్ళని గురించి చర్చ వచ్చింది ఇద్దరి మధ్యా !

మాంఛి అందమైనవాడూ, విశాలభావాలు గలవాడూ, డబ్బున్నవాడూ, నాలాగే డాక్టరుగావుంటే, అలాటి మనిషిని పెళ్ళిచేసుకుంటాను నేను! లేకుంటే పెళ్లే మానేస్తాను ! అంది సరళ.

ఊ! హిరణ్యాక్షవరాలు ఇంకా ఏంలేవూ ? కమల ఎగతాళిగా అంది.

ఇవి మామూలుగా అందరూ కోరేవే ! పోనీ నీగురించి కాస్త చెప్పరాదూ ? తను ఆత్రంగా అడిగింది.

ఎలాఅయినా కమలది అదోరకమైన గుంభన స్వభావం. తనలా గబుక్కున మనస్సులో ఉద్దేశ్యాలు మాటల్లో చెప్పదు.

నా మనసుకు నచ్చిన మనిషిని! కమల మెల్లిగా చెప్పింది.

అంటే! ఉద్యోగమూ, హోదా, డబ్బూ, చదువూ... ఏవీ లేకున్నా ఫర్వాలేదా? తను ఆశ్చర్యంగా అడిగింది... కమల మాటల్లో ధ్వనించిన భావమేమిటో సరిగా బోధపడక.

ఇష్ అబ్బ! పెళ్లిళ్ళ గొడవలు ఇప్పుడెందుకు సరూ? కాకున్నా నువ్వు సెలెక్టు చెయ్యకుండా నాకు పెళ్ళవుతుందా? కమల గలగల నవ్వుతూ ఇసక దులుపుకుంది లేచినిల్చుని!

ఆనాటి కమల మాటలు ఆ కెరటాల్లోనే అస్థిరాలు కాబోలు అనిపించింది సరళకు. ఒద్దనుకున్నా మళ్లీ వెనకటి వన్నీ దృశ్యాలుగా వస్తున్నాయి కళ్ళముందుకు.

మరోనాడు తనే చెప్పింది, "నీకు వరుణ్ణి నే సెలెక్టు చేశాను అంటే...అతను మామూలు మనిషి కానే కాడు... తెలుసా?" అంటూ.

అంటే ఏ దెయ్యాన్నో, భూతాన్నో చూపిస్తావన్న మాట! కమల పకపక నవ్వింది. ఆతర్వాత కమలకు క్లాస్ వచ్చింది. తను మామూలుగా పాస్ అయింది. వెంటనే పోస్టింగ్స్ వచ్చాయి. కమలకు వైజాగ్‌లోనూ, తనకు ఇక్కడా! తను ఉద్యోగంలో చేరిన రెండు నెలల్లోనే డాక్టరు మనోహర్‌తో పరిచయం కావటమూ, ఇద్దరూ ఒకరి

...కరు నచ్చటమూ రెండూ జరిగిపోయాయి. వెంటనే తల్లి దండ్రుల, బంధువుల, స్నేహితులందరి సమక్షంలో వివాహం జరిగిపోయింది. పెళ్ళికి కమలవొచ్చి ఎన్నో బహుమతులు ఇచ్చివెళ్ళింది. "హూఁ! పెళ్ళికిముందు ప్రేమలో పడగానే కమలకు ఉత్తరాలు వ్రాయలేదూ? మనోహర్‌ను జాబుల్లో పరిచయంచేసి, అంతటితో వూరుకోక తను కమలను పిలిపించి అతణ్ణి చూపించి మరీ సలహా కోరలేదూ? అసలు కమల ఒప్పుకుంటేనేగదా తను అమ్మనాన్నలకేనా ఈ సంగతి తెలియ జేసిందీ?

సరళకు చటుక్కున కమల జాబు స్మృతిపథంలో మెదిలింది. ముందుగా తెలిస్తే ... పెళ్ళికి ఒప్పుకోవని...అంటే? అంత రహస్యమన్నమాట? లేకుంటే కమల ఉద్దేశ్యమేమిటి? ఒకవేళ మనోహర్‌కంటే అన్ని విషయాల్లోను ఇంకా గొప్పవాడేమో కమలభర్త! అలా అయినా తాను అసూయ పడ్తుందా? అబ్బ! తల పగిలిపోతోంది. కంపార్టుమెంటులోని తోటి ప్రయాణీకు డెవరో 'స్టేషనేమి' టంటూ బయటివాళ్ళ నెవర్నో కేకపెట్టడంతో, మిగతా నలుగురైదుగురు ప్రయాణీకులతోబాటు సరళా వులిక్కిపడి చూచింది. టైం చూస్తే తెల్లవారుఝామున ఐదు కావస్తోంది. ఒళ్ళంతా బడలికగా వుంది ఆమెకు. 'లావెట్రీ' లోకి వెళ్ళొచ్చి కళ్ళుమూసుక పడుకుంది ఆమె. సన్నగా నిద్రకూడా పట్టింది.

*     *     *     *

"ఓ ... సరళా! నువ్వా? ఇలా చెప్పాపెట్టకుండా వచ్చావేం? వైర్ ఇస్తే నేను స్టేషనుకు రాకపోయానా? మనోహర్ రాలేదా?" కమల ప్రశ్నలవర్షంతోబాటు ఆశ్చర్యంగా, గాభరాగా మెట్లుదిగి పరుగెత్తుక ఎదురువచ్చింది.

"నయం! నన్నుచూచి అసలు నేనెవరో గుర్తిస్తావో లేదో అనుకున్నాను!" సరళ పొంగేకోపాన్ని అణుచుకున్నా, ఆమె కంఠస్వరం దాన్ని దాచలేకపోయింది.

"ఊఁ! బాగా కోపంగా వున్నావన్నమాట! పోనీలే, ముందు విశ్రాంతి తీసుకో. తర్వాత మాట్లాడుకోవచ్చు..." కమల స్నేహితురాలి వులెన్‌కోటు గుండీలు తీస్తూ అంది.

సరళ మనస్సు ఒక్కసారిగా ప్రేమతో నిండిపోయింది. కమలలో ఎలాటి మార్పూలేదు. తననుచూచి పసిపిల్లలా ఆనందిస్తోంది. మరి జరిగిందేమిటి? ఏమో!

"అబ్బ! రాత్రంతా నిద్రలేదు కదూ?"

"ఊఁ!" అంతకంటే ఎక్కువేమీ చెప్పలేకపోయింది సరళ. ఆమె కళ్ళుమాత్రం పరిసరాన్నంతా ఓ నూతన వ్యక్తి కోసం గాలిస్తున్నాయి!

"ఇదుగో వేలూ! కాఫీ టిఫినూ పట్టుకురా!" కమల వంటవాణ్ణి కాబోలు ఘట్టిగా కేకేసి సరళవేపు చూచింది.

సరళకు మండిపోతోంది. "ఇంతకూ డాక్టరుగారేరి?" ఉండబట్టలేక అడిగింది సరళ.

"ఏ డాక్టరుగారు?" కమల ఆశ్చర్యంగా చూచింది.

"అదే ... మీ వారు?"

కమల కిలకిల నవ్వింది. "మా వారు డాక్టరని ఎవరు చెప్పారు నీకు?"

"మరి! అర్థంగాక చూచింది సరళ."

"అవన్నీ తర్వాత మాట్లాడుకోవచ్చుగానీ, ముందా టిఫిన్ తీసుకో, చల్లారిపోతోంది." సరళ ఆశ్చర్యంగా చూస్తూ ప్లేటు ముందుకు లాక్కుంది ... ఆమెకీ వాతావరణం ఎలాగో వుంది.

పక్కనున్న గది కర్టెన్ గిరుక్కున లాగుతూ "సారీ కమలా! టిఫిన్ తీసుకోకుండా నాకోసం కనిపెట్టుక కూర్చు న్నావు కదూ? రాత్రంతా చదువుతూ నిద్ర..." గబుక్కున మాట్లాడటం ఆపి, కమలపక్కన వున్న స్త్రీనిచూచి లోపలికి వెళ్ళబోయాడా యువకుడు. సరళ తలెత్తి చూచింది. సన్నగా, పొడుగ్గా, తెల్లగా చాలా ఆకర్షణీయంగా వున్నాడతను ... ఎవరితను, కమల భర్తా?

"ఫర్వాలేదు రాండి! ఆమెపరాయిది కాదు. నే నెప్పుడూ చెపుతూంటానే...నా స్నేహితురాలు సరళ! ఇప్పుడే ఊరు నుంచి వచ్చింది..." కమల చెప్పుకుపోతోంది.

"నమస్తే" సరళ కీ దృశ్యం అర్థంకాకుండా వుంది.

"వారే మావారు. మిష్టర్ రఘు!" కమల సరళ వేపు తిరిగి భర్తను పరిచయం చేసింది.

"నమస్తే" ... చేతులు జోడించా డతను.

మిష్టర్ రఘు తర్వాత అతని డిగ్రీ చెబుతుందేమో ననుకుంటున్న సరళ అది రాకపోగా, అతని చేతులవేపు చూచి ఒక్కసారిగా ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్లుగా అయిపోయింది. అతని ఎడంచెయ్యి ... అదేమిటి వ్రేళ్లు సగంవరకూ లేవు ... అంటే ? ... ఒక్కసారిగా కంపించి పోయిందామె ! "రండి! టిఫిన్ తీసుకుందాం !" కమల మాటతో అతను ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు. కమల అనర్గళంగా ఏదేదో మాట్లాడ్తోంది. సరళకు కంఠం పట్టుకుపోయినట్లుగా వుంది.

"మీ కక్కడ చాలా వర్క్ వుంటుందాండీ ?" అంటూన్న రఘు గొంతు సరళకు కర్ణకఠోరంగా వున్నట్లుంది.

"ఊఁ !" అంది నిర్లిప్తంగా ...

"చాలా బడలికగా వున్నట్లున్నారు, బాగా విశ్రాంతి తీసుకోండి... !" ఆప్యాయత తొణికిసలాడ్తున్న అతని ముఖం వేపు చూడబుద్ధిగా లేదు సరళకు.

రఘు లేచి నిల్చుని..."నేనలా వెళ్లొస్తాను కమలా!" అంటూ సరళ వేపు తిరిగి "కొంచెం పనుంది. మరోలా అనుకోకండి" అన్నాడు.

"నాకూ ఆపరేషన్ కేసొకటుందీ పూట. తప్పక వెళ్లాలి. విశ్రాంతి తీసుకో...నా కోసం కాచుకూర్చోక భోజనం చెయ్యి సరళా! " అంటూన్న కమల వేపొకసారి చూచి... ఎడంచెయ్యి పేంటు జేబులో పెట్టుకుని గేటు తెరుచుకుని గబ

గబ వెళ్తున్న రఘును చూస్తూ కొయ్యబొమ్మలా నిల్చుండి పోయింది సరళ.

* * * *

టైం మధ్యాహ్నం రెండు దాటింది. రాత్రంతా నిద్ర లేకపోవటంతో, నిద్ర లేచినా కళ్ళ మంటలూ, బడలికా ఇంకా తగ్గలేదు. అద్దంముందు నిల్చుని చెరిగిన జుట్టు సరిజేసుక బొట్టుంచుకుంది సరళ. కమలా, రఘూ వెళ్లిపోయిన తర్వాత, ఈ పెళ్ళినీ, ఆదంపతులనూ గురించిన చిక్కురిబిక్కురి ఆలోచన లెన్నో చేసి, ఎప్పుడు నిద్ర పట్టిపోయిందోగానీ ఇప్పుడు మెలకువ వచ్చింది. ట్రేలో భోజనం పట్టుకవచ్చి టేబిల్ మీద అన్నీ అమర్చిపెట్టాడు వంటమనిషి వేలు.

“మీ అమ్మగారూ, అయ్యగారూ భోజనంచేసి వెళ్లారా ?” అడిగింది సరళ.

“అయ్యగారొచ్చి భోజనంచేసి వెళ్లారు. అమ్మగారింకా రాలేదండీ !” సమాధానం చెప్పి వెళ్లాడు వేలు.

“భోంచేస్తున్నావా సరూ ? నేనూ శలవుపెట్టేశాను ఓవారం రోజులపాటు” అప్పటివరకు పూర్తిగా పనిలోవుండటం వల్ల కమల ముఖమంతా పీక్కుపోయినట్లుగావుంది.

భోజనం పట్టుకొచ్చాడు వేలు. ఇద్దరూ తినటం పూర్తి చేశారు. చెయ్యితుడుచుకొని కిటికీ తలుపుల కానుకుని నిల్చుని దూరానవున్న శూన్యంలోకిచూస్తూ నిట్టూర్చింది సరళ “సృష్టి వైచిత్రం” అంటూ. సృష్టిలో అంత వైచిత్రం నీకేం కనిపించింది సరూ, ఈ ఎండవేళలో ? కమల నవ్వుతూ అడిగింది.

"దొండపండు కాకిముక్కుకుపోవడం విచిత్రం కాదూ? అందమైన నెమలి - నల్లగా అసహ్యంగా వుండే మేఘాల్ని చూచిమురిసిపోవటం వింత కాదూ? అలాగే..." సరళ కమల" వేపు చూచి సంకోచిస్తూ ఆగింది.

"ఊఁ! ఊఁ! పూర్తిచెయ్యి, సంకోచమెందుకూ?" కమలకు తెల్సు ఆమె ఏమి చెప్పబోతోందో.

"ఇంకా ఏముందీ? అందమూ, చదువూ...ప్రపంచంలో గొప్పగా బ్రతకడానికి కావాల్సిన అన్ని సదుపాయులూ వున్న ఓ యువతి అమాంతం ఓ పనికిమాలిన...సారీ. అందులో ఏ ఒక్కటీలేని ఓయువకుణ్ణి అందులోనూ కుష్టు...పెళ్లాడేసింది. ఇది చిత్రం కాదా?" సరళ ఒక్కసారిగా తన మనసులో భావాలు వెళ్ళగక్కేసింది.

తిరుగుతున్న ఫాన్‌వేపుచూస్తూ స్థిమితంగా అంది కమల "అది చిత్రమేమీ కాదు. మానవత్వపు లోతులను చూసేవారెవరూ అలా అనుకోరు సరూ!"

"అసలింతకూ ఎంతమంది లేరు యువకులు లోకంలో? ఇతనెలా నచ్చాడునీకు కమలా? అందం సంగతి అలావుంచు. కనీసం చదువేనా? ఏ ఒక్క క్వాలిఫికేషనేనా నీకు సరిపోయింది వుందా అతనిలో?" సరళ మాటల్లో బాధ వ్యక్తమౌతోంది.

"ఉన్నాయి సరూ! చాలా వున్నాయి. అయితే అవి అందరికీ పైకి కనిపించవు. మనిషిలో నిజంగా వుండాల్సిన మానవత్వముంది. ఎదుటివారి కోసం తన ప్రాణాన్నివ్వగల

త్యాగశీలతవుంది బాహ్యాడంబరానికి కావల్సిన చదువులూ డిగ్రీలూ క్వాలిఫికేషన్లూ లేకున్నా, మనిషి పరిపూర్ణుడు కావటానికి కావల్సిన సుగుణాలన్నీ వున్నాయి అతనిలో''...కమల ఆగి సరళ వేపు చూచింది.

సరళ ఆశ్చర్యంగా వింటోంది. "అదంతా పెద్ద కథ సరూ! వినటానికి నీకు విసుగేస్తుందేమో!" కమల అడిగింది.

"లేదు. విసుక్కోను చెప్పు!" సరళ కమల పక్కన కూర్చుంది. "చూడు సరూ! రఘును వివాహం చేసుకోటంలో చెయ్యరాని పొరబాటు చేశాననీ, జీవితంలో సరిదిద్దుకోలేని పిచ్చిపని చేశాననీ, నువ్వూ...నువ్వేమిటి? మా వివాహాన్ని చూచిన, ప్రతిఒక్కరూ అపోహపడ్తున్నారు. కానీ నింపాదిగా ఆలోచిస్తే నామట్టుకు నేను పొందిన ఆత్మసంతృప్తి ప్రపంచంలో మరే జీవీ పొందివుండదు. పొందదు కూడాను!" కమల చెప్పుకుపోతోంది. వింటోంది సరళ.

"ఆరోజు హాస్పిటల్ నుంచివచ్చి, అలసటగా వుంటం వల్ల, అలా వరండాలో కూర్చుని వున్నాను. రఘు కంగారుగా పరుగెత్తుకవచ్చాడు. మొదటిసారిగా నేనతన్ని చూచింది అప్పుడే. 'మీరేనాండి, డాక్టర్ కమల? ప్లీజ్! చాలా అర్జంటుగా రావాలి డాక్టర్! కాన్పు కేసు...' ఒగరుస్తున్నాడతను."

"[illegible] నవ్వూ, జాలీ ముంచుకు వచ్చాయి. అతని ముఖ[illegible] [illegible]ష్టంగా కన్పిస్తున్న ఆత్రుతా, అమాయకత్వమూ

చూస్తుంటే కాదనటానికీ, ఒక్క క్షణం ఆలస్యం చెయ్యటాని కూడా మనస్కరించలేదు. బేగ్ చేత పుచ్చుకున్నాడతను. ఓ ఫర్లాంగు దూరంలో చిన్న పెంకుటింట్లోకి పిల్చుకు వెళ్లాడు. నిజంగా చాలా ప్రమాదమైన కేసే! కాన్పులో బిడ్డ చని పోయింది. దేవుడి దయవల్ల తల్లి బ్రతికింది. చేతులు శుభ్ర పరుచుక గదిలోంచి ఇవతలకివస్తూ అదృష్టవంతులండీమీారు... ఇంకేం ఫర్వాలేదు మీా అవిడకి!'' అన్నాను.

"ఆ ఆవిడ నా భార్య కాదండీ!'' అన్నాడు.

గతుక్కుమన్నాను. చెల్లెలేమోననుకొని...అడిగాను.

"ఊహూఁ! వాళ్ళెవరో నాకు తెలీదు. అన్నాడు ముభావంగా. విస్తుపోయాను.

ఒక్కసారి నేను లోపలికి వెళ్ళి చూడవచ్చా? అన్నా డతను కుతూహలంగా. నాకేమిటో అంతా విచిత్రంగావుంది. ఊఁ! అన్నాను. నా వెంటే లోపలికివచ్చి గది గుమ్మంమీాద రెండుచేతులు అడ్డంగా ఆన్చి బావుందా ఆవిడకి బామ్మ గారూ! అన్నాడు బాలింతరాలి పక్కనున్న పెద్దావిడతో.

నీ దయవల్ల, డాక్టరమ్మ దయవల్లా గట్టున పడ్డాం నాయనా! అంటూన్న ఆవిడ కృతజ్ఞతా పూరిత కంఠస్వరం ఒక్కసారిగా కఠోరంగా మారిపోయింది.

మరీ లోపలికి రాకబ్బాయ్! నీ ఎడంచెయ్యి...అదే మిటి? కుష్ఠులావుందే! అందాకా నేను గమనించి అతన్ని చూళ్ళేదు. నా వేపొకసారి బాధగా చూచి ఎడంచెయ్యి

చప్పున పేంట్ జేబులో పెట్టుకుని నే వెళ్లొస్తా బామ్మగారూ! అంటూ రెండడగులు వేశాడు.

మళ్ళీ ఏమనుకున్నాడో నావేపు తిరిగి క్షమించండీ డాక్టర్! మీ బేగ్ పట్టుకవచ్చి మిమ్మల్ని ఇంటిదగ్గర దిగబెడతాను పదండి...మీ కభ్యంతరం లేకపోతే! అన్నాడు.

రండి! అన్నాను.

దోవలో ఏమీ మాట్లాడలేదు ఇద్దరమూ.

గేటుదగ్గరే వెళ్ళొస్తానన్నాడు. లోపలికి రమ్మన్నాను. వచ్చి కూర్చున్నాడు. జేబులోంచి పది రూపాయల నోటుతీసి ఇవ్వబోయాడు. అక్కర్లేదు లేండి ... ఇంతకూ వాళ్లెవరు? అన్నాను.

ఎవరో నాకు తెలియదు. అలా దోవనవస్తూంటే పెద్దగా ఏడుస్తూ ఆ పెద్దావిడ వచ్చింది. వాళ్ళమ్మాయి ప్రాణాపాయ స్థితిలో వుందనీ, మొగదిక్కెవరూ లేరని, ఎవరేనా డాక్టర్ని పిల్చుకరమ్మని వాపోయింది...నేను మీ దగ్గరకు వచ్చాను. అంతే! అన్నాడతను నిర్లిప్తంగా!

మీ పేరు? నా కేమిటో అతన్ని గురించి తెలుసుకోవాలని కుతూహలం జాస్తయిపోతోంది.

రఘుపతి!

ఏం ఉద్యోగం చేస్తున్నారిక్కడ?

నేనా? ఏమీ చెయ్యటంలేదు. కొన్ని పత్రికలకు కథలు వ్రాసి పంపిస్తాను. వారు కాంట్రాక్టు ప్రకారం నెలకు కొంత డబ్బు పంపిస్తుంటారు.....

ఏం చదువుకున్నారు ?

ఇంటర్ పాసయ్యాను. అప్పుడే ఈ జబ్బు హఠాత్తుగా వచ్చింది...అంతటితో అన్నిటికీ స్వస్తి చెప్పాల్సి వచ్చింది... బాధగా కుర్చీ వెనక్కు పెట్టుకునివున్న ఎడమచెయ్యి చూపించి మళ్ళీ పక్కకు పెట్టేసుకున్నాడు.

నా హృదయం బాధతో గిలగిల లాడిపోయింది. ఇందాకటి ఆ పెద్దావిడ ప్రవర్తన గుర్తుకు వచ్చింది. బహుశా ఇల్లాగే అందరూ కాలేజీలో కూడా అసహ్యించుకుని...అతని భవిష్యత్తు నాశనం చేశారేమో !

మరి మీ వాళ్ళు మందులిప్పించారా! అన్నాను లోపలి ఆవేదనను అణుచుకుంటూ.

ఆ! చాలాచోట్ల మందులిప్పించారు వెంటనే...ఈవ్యాధి ఇక ఒళ్ళంతా వ్యాపించకుండా ఇంతటితో ఆగి పోయేలా...ఓ పెద్దడాక్టర్ మందులిచ్చారు. ఇక ఇది ఎక్కువ కాదు...కానీ ఈ చెయ్యిమాత్రం ఇంతే? రఘు స్పష్టంగా మాట్లాడుతున్నాడు...ఏమీ దాచుకోటంలేదు.

అప్పుడప్పుడు వీలుచూచుకుని ఇక్కడికి వస్తూండండి. నేనూ సాయంత్రం సమయాల్లో తీరికగానే వుంటాను. మామూలుగా అన్నాను ఆ రోజుకు అతన్ని ప్రశ్నలతో బాధించటం ఇష్టంలేక.

మీకు సంకోచం లేకుంటే...తప్పక వస్తుంటాను ! అన్నాడు.

నవ్వాను. నేనూ ఒక డాక్టర్నే సంగతి మీకు తెలుసుగా ? అన్నాను.

వస్తాను. ఏమస్తే డాక్టర్...! రెండు చేతులూ నిస్సంకోచంగా జోడించి గబగబ నడిచి వెళ్ళిపోయాడు రఘు.

లోకం తీరుతో, ప్రవర్తనతో బాగా దెబ్బతిన్న అతని హృదయాన్నీ, దానివెనుక దాగివున్న అభిమానాన్నీ స్పష్టంగా నా మనో నేత్రాలతో చూడగలిగాను నేనారోజు.

చూడు సరూ ! ఆ రోజునుంచీ తరచూ వస్తూండేవాడు రఘు. అతని మాటల్ని వింటూంటే సాటి మానవుల లోని అవగుణాలూ, స్వార్థపరత్వమూ కళ్ళకు కట్టినట్లు కన్పిస్తుండేవి. కాలం గబగబా నడిచి పోతుండేది. ఇలా అతను వచ్చివెళ్ళటం చూచే హాస్పిటల్ స్టాఫూ ఇంకా ఇతరులూ, బహుశా తలోరకంగా అనుకుని వుంటారు. కానీ రఘును తల్చుకున్నపుడల్లా, భగవంతు డతడికి చేసిన చిన్న అన్యాయానికి, లోకంలో అతను పొందిన అవమానాలూ, బాధపడిన అతని అమాయకపు హృదయమూ ఆలోచిస్తే, నా మనస్సంతా జాలీ, సానుభూతి, ప్రేమలతో నిండిపోయేది. అతన్ని గురించి క్రమంగా చాలా విషయాలు తెల్సుకున్నాను. తల్లీ, తండ్రీ, అక్క-చెల్లెళ్ళూ, అన్నదమ్ములూ అంతా వున్నారట. ఈ జబ్బు మూలంగా, మిగతావాళ్ళకూ-డా పెళ్ళిళ్లు కావటం కష్టమై పోవటంతో...ఇంటినుంచి పారిపోయి వచ్చేశాడు...!

నా ఒక్కడివల్ల అందరి జీవితాలూ నాశనంకావడం... నేనో సమస్యగా అందరికీ పరిణమించడం నా కిష్టం లేదు డాక్టర్ ! అంటాడతను ఆ విషయాలు మాట్లాడుతూ !

ఢాక్టర్ మహేశ్వర్ నీకు తెలుసుగదూ సరూ ! నువ్వు కోరే అందమూ, చదువూ...వగైరా గొప్పలక్షణాలన్నీ అతనిలో వున్నాయి...నన్ను తనను వివాహం చేసుకోమని కోరుతూ ఉత్తరం వ్రాశాడు ఒకసారి. ఆ రోజు రాత్రి ఆ ఉత్తరం ముందుపెట్టుక తీవ్రంగా ఆలోచించటం మొదలెట్టాను. అన్ని క్వాలిఫికేషన్స్‌వున్న డాక్టర్ మహేశ్వర్‌కు నే కాకుంటే, నా కంటే అన్ని విషయాల్లోనూ గొప్ప స్త్రీ భార్యగా దొరకగలదు...కానీ రఘు ? అది వ్యాపించకుండా అన్ని రకాల జాగ్రత్తలూ తీసుకున్నప్పటికీ - చిన్న అంగవైకల్యాన్ని ఆధారంగా తీసుకొని తెలివీ, అందమూ, మంచి హృదయమూ వుండీకూడా అతను అటు చదువుకూ, ఇటు ఉద్యోగాలకూ, చివరకు స్వేచ్ఛగా మానవుల మధ్య మెలగటానికూడా నోచుకోని రఘూ బాధను అర్థం చేసుకోగలిగే దెవరు ? అతని గాయపడిన హృదయానికి ఉపశాంతి కల్గించి ఆ నైరాశ్యాన్ని పోగొట్టే దెవరు ? అతన్ని దగ్గరకు తీసే దెవరు ? అందుకే నేనా భారం వహించాను. ఒక నిర్ణయానికి వచ్చి, మహేశ్వర్ కోరిక నిరాకరిస్తూ వెంటనే ఉత్తరం వ్రాసేశాను.

నా నిర్ణయాన్ని రఘుకు చెప్పినరోజు అతని మాటలు తల్చుకుంటే ఇప్పుడూ నాకు ఆనందం వేస్తుంది.

డాక్టర్ ! కేవలం జాలీ, సానుభూతులతోనే మీరు మీ జీవిత సమస్యను పరిష్కరించుకోకండి...నేను మీ కెలాగూ తగినవాణ్ణి కాను. మన దాంపత్యాన్ని గురించి లోకులు హేళన చేసేనాడు బాధపడి లాభం లేదు...అన్నాడు.

ఫర్వాలేదు. అందుకు తగ్గ మనస్థయిర్యం నాకు వుంది! అన్నాను.

ఆ చిత్తశుద్ధీ, ఆత్మస్థయిర్యం ఎందరిలో వుంటాయి, చెప్పు సరూ? మనిషిలో ఇంతకంటే ఇంకేం కావాలి? వెంటనే వివాహం చేసుకున్నాను. అదీ చాలా నిరాడంబరంగా! నీకక్కడ ముందుగా తెలియబర్చలేదని నీకు కోపం వచ్చుం టుంది...కానీ నువ్వు రఘును ముందు చూస్తే...అతని వివ రాలు తెలిస్తే ఈ పెళ్ళికి ఒప్పుకునేదానివా? ఛస్తే ఒప్పు కోవని నాకు తెలుసు. నువ్వు కాదు...నా శ్రేయోభిలాషు లెవ్వరూ ఒప్పుకోరు. ఓ రోజు బీచిఒడ్డున నీకు చెప్పాను గుర్తుందా? సరూ? నేను నా మనసుకు నచ్చిన మనిషిని వివాహం చేసుకుంటానని! అతనే రఘు. నా పెళ్ళిరోజు నీ లానే చాలామంది నాకు మతిస్థిరం తప్పిందనుకున్నారు...చచ్చి పోయిన ఉత్సాహాన్ని అతనిలో చిగురింప జేశాను. రేపు మార్చికి బి. ఎ. పరీక్షకు కూర్చోబోతున్నారు...ఇన్ని రోజు లుగా కేవలం మానవుల శారీరక బాధల్ని, గాయాల్ని మాత్రమే డాక్టర్‌గా నయంచేయ గలిగాను...కానీ ఇప్పుడు! హృదయంలో బలమైన గాయం ఏర్పడిన ఓ మనిషినీ, అతని

జీవితాన్ని డాక్టర్ గా కాదు...మనిషిగా నయంచేయ గలి గాను...అదే నాకు ఎంతో సంతృప్తి! ఏమంటావ్ సరూ? నే చేసింది తెలివితక్కువ పనా? పిచ్చిదాన్నయి పోయానా నేను? కమల ఆతురతగా సరళ వేపు చూచింది.

ఇంత సేపూ తదేకధ్యానంతో వింటూన్న సరళ ఏదో లోకంలో వుంది. ఆమెకు కమల ప్రతిమాటా, దృశ్యకావ్యంలా కన్పిస్తోంది. కమల మాటలలో ఆమెకు విలువలేని నగ్నసత్యా లేవో ఎదురుగా వచ్చి నిల్చున్నట్లుగా వుంది. అందుకే ఆమె వెంటనే ఏమీ మాట్లాడలేకపోయింది.

"చెప్పు సరూ? నే చేసింది పిచ్చిపనా?" కమల సరళను బలంగా ఊపుతూ ఆవేశంగా అడుగుతోంది.

సరళ తెప్పరిల్లింది. "లేదు కమలా! లేదు! నిజం గానే - నిజంగానే చాలా మంచిపని చేశావ్! వివిధ రకాలుగా మీ దాంపత్యాన్ని గురించి అనుకునేవాళ్ళే...చివరకు నేను కూడా... తెలివి తక్కువ వాళ్ళమే...!" సరళకళ్ళు ప్రేమతో చెమ్మగిల్లాయి.

అప్పుడే వచ్చిన రఘు, "కాస్త బడలిక తగ్గిందాండి? భోజనం చేశారా? కమలా! నీ వర్కు కూడా అయి పోయిందా?" అంటూ గదిలోకి వచ్చాడు. అతని కంఠ స్వరమూ, ఆకారమూ ఇప్పుడు సరళకు కఠోర మనిపించ లేదు. ఎవరో ఉన్నతుడైన మనిషిని కొత్తగా చూస్తున్నట్లనిపించింది.

స్నేహపూరితంగా లేచి నిల్చుంటూ "ఆ! బాగా విశ్రాంతి తీసుకున్నాను. అసలు మీ ఇద్దర్నీ చూస్తూనే సగం శ్రమ మర్చిపోయాను మిష్టర్ రఘూ!" అంది సరళ నవ్వుతూ.

వారం రోజులు సరదాగా గడిచిపోయాయి.

స్టేషన్‌కువచ్చి ట్రయిన్ కదలబోతూండగా, "జాగ్రత్త సరూ" అంటూన్న కమలతో "మీరిద్దరు తప్పక ఓసారి రాండి కమలా!" అంది సరళ.